మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

● ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

రొళ్ల: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో 'వైఎస్సార్ ఆసరా' కింద మండలంలో 574 పొదుపు సంఘాల్లోని 5,863 మంది సభ్యులకు రూ.2.61 కోట్ల మూడో విడత చెక్కును మహిళలకు అందజేశారు. అంతకుముందు సింగిల్ విండో కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా డప్పు వాయిద్యాల నడుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. మండల సమాఖ్య, సంఘం సభ్యులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం నాలుగు విడతల్లో 'వైఎస్సార్ ఆసరా పథకం' ద్వారా డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తోందన్నారు. రాజకీయాల్లో, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ఎప్పటికి మరచిపోవదన్నారు. మహిళల భద్రత లక్ష్యంగా దిశ చట్టం, దిశ యాప్‌తో పాటు దిశ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీశైలం డ్యాం నుంచి కృష్ణా జలాలను హంద్రీ-నీవా కాలువ ద్వారా తీసుకువచ్చారన్నారు. సీఎం జగన్ కృష్ణా జలాలను నియోజకవర్గంలోకి తీసుకువచ్చి మడకశిర చెరువును నింపడం జరిగిందన్నారు. త్వరలోనే అన్ని మండలాలకు హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరు నింపే కార్యక్రమం చేపడతామన్నారు. ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం కింద అందించిన సాయాన్ని కుటుంబ అవసరాల కోసం ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. సీఎం సహకారంతో మడకశిర నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. మహిళలు సీఎం జగన్‌కు అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. అనంతరం మండల సమాఖ్య సిబ్బంది, సంఘం సభ్యులు, నాయకులు తదితరులు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, డైరెక్టర్ నేత్రావతి, ఎంపీపీ హెచ్‌డీ కవిత, వైస్ ఎంపీపీ రత్నమ్మ, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ కిష్టప్ప, వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ ప్రసాద్, ఏపీఎం సువర్ణ, సింగిల్ విండో చైర్మన్ మోతిరాం నాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ జయరామప్ప, డైరెక్టర్ శ్రీనివాస్, పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, సీనియర్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు

సన్మానం..

మడకశిర: నియోజకవర్గంలో మైనార్టీల సంక్షేమానికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామిని జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు మొగల్ నూరుల్లా కోరారు. శనివారం ఆయన మడకశిరలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. మైనార్టీల అభివృద్ధికి సహకరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ మైనార్టీ నాయకులు అక్రం, అన్సర్, ఫక్రుద్దీన్, జిల్లా వక్ఫ్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

5న అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

మడకశిర: నియోజకవర్గంలోని భక్తుల సౌకర్యార్థం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 5న అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు నడపనున్నట్లు డీఎం రామసుబ్బయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న సాయంత్రం 4 గంటలకు బస్సు బయలుదేరి వెళ్తుందన్నారు. సర్వీసు నంబర్ 94644కు ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వేషన్ చేయించుకునే అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


అధికారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎంపీడీఓ నరేంద్రను వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయానికి పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి సమస్యలపై అధికారులతో చర్చించారు. గ్రామాల వారీగా మమేకం కార్యక్రమం ద్వారా పర్యటించినప్పుడు ప్రజలు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరారు. అలాగే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ నంజప్ప, పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నాగరాజు, నారాయణరెడ్డి, గోపాల్,అనిల్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి మహాసభ జిల్లా అధ్యక్షుడిగా పాళేగార్ లోకేశ్



పావగడ: అఖిల కర్ణాటక వాల్మీకి నాయక మహాసభ యువ విభాగం తుమకూరు జిల్లా అధ్యక్షుడిగా స్థానిక వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు దేవలకెరె గ్రామానికి చెందిన పాళేగార్ లోకేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం బెంగళూరులోని పుట్టణ్ణ శెట్టి కళామందిరంలో యువ విభాగం పదాధికారుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. రాజనహళ్ళి వాల్మీకి గురుపీఠాధిపతి వాల్మీకి ప్రసన్నానంద పురి స్వామిజీ, స్థానిక నిడుగల్ సంస్థానం వాల్మీకి పీఠాధిపతి సంజయ కుమార స్వామిజీ తదితరులు లోకేష్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు.

విద్యా సామగ్రి పంపిణీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం ఉన్నత పాఠశాలలోని 50 మంది 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాయడానికి ఉచితంగా అట్టలు, పెన్నులు, జామెట్రీ బాక్సులను వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల నాయకుడు లక్ష్మీనారాయణ శనివారం అందజేశారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకుని, మంచి ఫలితాలు సాధించాలన్నారు. దాత లక్ష్మీనారాయణను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మూర్తి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై అవగాహన


పాడి రైతులకు సూచనలిస్తున్న అధికారులు

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి, ఎల్ తిమ్మాపురం గ్రామాల్లో లేగ దూడల పెంపకంపై పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ జాహ్నవి తెలిపారు. యద కాలం సరిగా ఎలా గుర్తించాలి? దూడల పెంపకం, వాటి సంరక్షణ, సార్టెడ్ సెమిన్ తదితర అంశాలపై వివరించారు. లేగదూడలతో కాల్ఫ్ ర్యాలీ నిర్వహించారు. దూడలను ఆరోగ్యంగా పెంచుతున్న పలువురు రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, ఏహెచ్ఏలు ప్రకాష్, భోజరాజు, విశ్వనాథ్, శైజల, గోపాల మిత్రలు బ్రహ్మానందరెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుడిబండ: 'అందరూ బాగుండాలి అందులో మనముండాలి' అనే అంశంపై శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో నైతిక విలువలుపెంపొందించడానికి, సమాజసేవ, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించేందుకు పోటీలు పెట్టినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. జూనియర్ విభాగంలో చరిత, వందన, హర్ష, సీనియర్ విభాగంలో విద్య, భవ్య అనే విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిచంద్ర కుమార్ పీడీ పాయికృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

అమరాపురం: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 3వ తేదీ నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని మండల విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ తరగతులు నిర్వహించాలన్నారు. ఎవరైనా మధ్యాహ్నం పూట బడులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరిగే రోజున మధ్యాహ్నం 1:00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

మడకశిరరూరల్: మండలంలో 5 ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతులు ఉపాధిహామీ పథకం ద్వారా డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సోనిబాయి, ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, అల్ల నేరేడు, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్ తదితర మొక్కలు అందజేస్తామన్నారు. సాగు చేసిన మొక్కలను సంరక్షించుకోవడానికి రైతుకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం ఎకరాకు రూ.36 వేల చొప్పున మూడు సంవత్సరాల పాటు బిల్లులు చెల్లింస్తుందన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత కల్పిందన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ బాలాజీ

అమరాపురం: సచివాలయాల పరిధిలోని కార్యదర్శులు వందశాతం పన్నులు వసూలు చేయాలని పెనుగొండ డీఎల్‌పీఓ బాలాజీ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఏయే గ్రామాల్లో ఎంత పన్ను వసూలు చేశారు? ఇంకా ఎంత పెండింగ్ ఉంది తదితర వివరాలను గ్రామ సచివాలయాల వారీగా అడిగి తెలుసుకున్నారు. పన్ను వసూలులో వెనుకబడిన వారు, మిగతా కార్యదర్శులు వలంటీర్ల సహకారంతో ఈనెల 7లోపు వందశాతం వసూలు చేయాలన్నారు. అలా చేయని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీల పరిధిలో ఆదాయ వనరులను పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం సక్రమంగా అమలు చేయాలన్నారు. వీధులను శుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువలను శుభ్రం చేయించాలని సూచించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా భూ హక్కు పత్రాలను లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. అనంతరం మండలంలోని హేమావతి సిద్ధేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునిస్వామి, ఈఓఆర్డీ సుధాకర, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి

అమరాపురం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు మోహన్‌కృష్ణ అన్నారు. శనివారం స్థానిక శ్రీ సరస్వతీ విద్యామందిరం 34వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు భరత నాట్యం, జానపద గేయాలు, సినిమా పాటలకు నృత్యం చేశారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యామందిరం అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బాలాజీరావు, కమిటీ సభ్యులు పాఠశాల హెచ్‌ఎం.సుకన్య పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మడకశిర(అగళి): అగళి మండలంలో ట్రక్ డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లు సమ్మెబాట పట్టడంతో పేదలు ఇబ్బందులు పడకుండా శనివారం ఆర్ఐ గురప్ప, వీఆర్ఓలు వరలక్ష్మి, నరసింహమూర్తి తదితరులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వీఆర్ఓ లాగిన్‌లోనే అగళిలోని ఒక షాపులో బియ్యం, చక్కెర, కంది బేడలు అందజేశారు. అన్ని గ్రామాల్లో కూడా ప్రజలు ఇబ్బందులు పడకుండా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష


నీలకంఠాపురంలో ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఉట్ల పరుష,సీతారాముల బ్రహ్మరథోత్సవం, జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను నీలకంఠేశ్వర స్వామికి సమర్పించి పూజలు నిర్వహించారు. యువకులు ఉట్లమాను ఎక్కి ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొన్నారు.

రేపటి గెలుపు వారధులు మీరే


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బృహత్తర బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం బెంగళూరు రోడ్డులోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాలెండర్ ప్రకారం సంక్షేమ ఫలాలు అందరికీ అందుతున్నాయని తెలిపారు. సీఎం జగన్ చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనే ఉండదన్నారు. అక్కచెల్లెమ్మల బ్యాంకు రుణాలు మాఫీ చేస్తానంటూ మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల చివరి నిమిషంలో పసుపుకుంకుమ పేరుతో మోసం చేశారన్నారు. చంద్రబాబు సిల్క్ డెవలప్‌మెంట్ పేరుతో వీరి కంపెనీల్లోకి నిధులు మళ్లించి ప్రజధనాన్ని దోచుకున్నారని తెలిపారు. 23 మంది ఎమ్మెల్యేలను కొన్నరీతిలోనే ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు నోట్లు అందించి గెలిచారని ఎద్దేవా చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు చేకూరిన లబ్ధిని మరింత వివరంగా తెలియజేయడానికి కన్వీనర్లు నడుం బిగించాలన్నారు. పచ్చి అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు, లోకేష్ సిద్ధహస్తులన్నారు. బాలకృష్ణ గెలిచినప్పటి నుంచి ప్రజల మధ్యకు వచ్చారా? ఏం కష్టముందని అడిగారా అని ప్రశ్నించారు. అసలు ఆయనకు హిందూపురం గుర్తు లేదన్నారు. పెళ్లి పేరంటాలకు బంధువులొస్తారు అలా వచ్చి ఇలా వెళ్లిపోతారన్నారు. ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపించడం పురం ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. అనంతరం ఈనెల 4వ తేదీన జరగనున్న తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవ పూజకు ఎమ్మెల్సీ ఇక్బాల్ రూ.10 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, జెడ్పీటీసీ నాగభూషణం, శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెవడానికి గ్రామ స్థాయిలో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు కృషి చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ తెలిపారు. శనివారం ఆమిదాలగొంది, చందకచెర్లు, ఆర్ అనంతపురం, ఛత్రం పంచాయతీల్లో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతంపై అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో కన్వీనర్లు, గృహసారథులు కీలక పాత్ర పోషించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించి మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప పాల్గొన్నారు.

ఎండు తెగులును నివారించుకోండి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ ఇమ్రాన్

హిందూపురం టౌన్: మొక్కజొన్నకు ఆశించే ఎండు తెగులు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి ఇమ్రాన్ అన్నారు. శనివారం మండలంలోని బేవినహళ్లి గ్రామం వద్ద రైతు శ్రీనివాసులుకు చెందిన మొక్కజొన్న పొలాన్ని పరిశీలించారు. కంకి, గింజ కట్టు దశలో అక్కడక్కడ చెట్లు ఎండిపోవడం గుర్తించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. వేసవిలో మొక్కజొన్నకు ఎండు తెగులు ఆశిస్తుందన్నారు. ఇది ఫ్యూజరియం అనే శిలీంద్రం వల్ల వస్తుందన్నారు. గింజ పాలు పోసుకునే సమయంలో ఈ తెగులు వస్తుందన్నారు. ఈ శిలీంద్రం మట్టిలో, విత్తనాల ద్వారా సంక్రమిస్తుందన్నారు. నీటి ఎద్దడి కారణంగా కూడా ఈ రోగం పెరుగుతుందన్నార. దీని నివారణకు రిడోమిల్, కవాట్ 1.5 కేజీ, 500 గ్రాముల చొప్పున ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే అసిస్టెంట్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

పెనుకొండ: పట్టణంలోని మిట్టాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పురోహితులు శేషప్ప స్వామి ఆధ్వర్యంలో సీతారాములకు వేద మంత్రోచ్ఛరణాల మధ్య కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో మిట్టాంజనేయస్వామి డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీ దేవి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 10వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, స్నానపు గదులు, మంచినీటి సౌకర్యంతో పాటు ఇతరాత్ర మౌలిక వసతులు కల్పించాలని గ్రామ పెద్దలు, భక్తులు శనివారం సాయంత్రం కోరారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దేవదాయ శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

పావగడలో పోటాపోటీ


కేఎం తిమ్మరాయప్ప (జేడీఎస్ అభ్యర్థి)


హెచ్‌వీ వెంకటేశ్ (కాంగ్రెస్ అభ్యర్థి)

పావగడ: స్థానిక విధానసభ క్షేత్రం ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థి కేఎం తిమ్మరాయప్ప, కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వి వెంకటేశ్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. రాజకీయాల్లో తలపండిన జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప ఇది వరకే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి తాలూకా వ్యాప్తంగా అన్ని వర్గాల్లో మంచి గుర్తింపు పొందారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు సుమారు 40 వేలకు పైగా మాదిగ సామాజిక ఓటర్లు ఉండటం కలిసొచ్చే అంశం. ఇతర సామాజిక వర్గాల నుంచి మద్దతు ఉంది. ఇక వడ్డెర సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రెండు సార్లు మంత్రి పదవి చేపట్టిన తండ్రి వెంకటరమణప్ప పలుకుబడితో మంచి గుర్తింపు పొందారు. ఒక సారి జెడ్పీ సభ్యుడిగా గెలుపొందారు. దాన ధర్మాలు చేయడం, ఆపదల్లో ఉన్న వారిని ఆదుకుంటూ ప్రజలకు చేరువయ్యారు. గత 2013 విధానసభ ఎన్నికల్లో తిమ్మరాయప్ప చేతిలో ఓడిపోయారు. ఈసారి ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో అన్ని వర్గాల నాయకులు, ఓటర్లను కలిసి, మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ పోరులో ఎవరు గెలిచినా దాదాపు నాలుగు వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గట్టెక్కే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం


గోరంట్ల: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డివిజనల్ విద్యాశాఖ అధికారి రంగస్వామి

లేపాక్షి: మండల కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ నాగరాజు తెలిపారు. శనివారం ఎంఆర్‌సీ కేంద్రంలో ఉపాధ్యాయులతో సమీవేశం నిర్వహించారు. అనంతరం పరీక్షా కేంద్రాలను పరిశీలించి, ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రతి గదిలో ఫ్యాన్, లైటింగ్, తాగు నీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 40 మంది ఉపాధ్యాయులను, 24 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు.

గోరంట్ల: పదో తరగతి విద్యార్థుల కోసం వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డివిజనల్ విద్యాశాఖ అధికారి రంగస్వామి పరిశీలించారు. మండల కేంద్రంలోని 7 పరీక్ష కేంద్రాల్లో 1,421 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

పెనుకొండ: పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలో 11,350 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నట్లు పెనుకొండ డీవైఈఓ రంగస్వామి శనివారం తెలిపారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఏ మాత్రం ఆలస్యం అయినా పరీక్షా గదిలోకి అనుమతించడం జరగదన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

చిలమత్తూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ నాగరాజు పేర్కొన్నారు. మండలంలో 590 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలి

అమరాపురం: గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులకు చిరు ధాన్యాల ఉత్పత్తిపై అవగాహన కల్పించాలని వీఓఏలకు ఏపీఎం తిప్పన్న పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీఓఏలు మహిళా సంఘాల సభ్యులు జొన్న, రాగి, సజ్జ, కొర్ర, సాములు, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసేలా రైతులకు సూచించాలన్నారు. అదే విధంగా మహిళా సంఘాల సభ్యులు పొదుపు, రుణాలను సక్రమంగా చెల్లించాలని కోరారు.

మడకశిర(అగళి): అగళిలోని ముక్కడంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, వైద్య సిబ్బంది లిఖిత, గంగిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రవల్లిక, అరుణ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షలో బీసీ గురుకుల విద్యార్థుల సత్తా

మడకశిర: మండలంలోని గుండుమలకు చెందిన మహాత్మజ్యోతి రావుపూలే బీసీ గురుకుల కళాశాలలో చదువుతున్న 22 మంది ఎంపీసీ విద్యార్థులు హెచ్‌సీఎల్-టెక్‌బీ సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో పాసైనట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్‌భూపాల్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాసైన విద్యార్థులకు ఆ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారన్నారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులను కంపెనీ వారు బీటెక్ చదివించి, ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ కోర్సులు చదువుకునే సమయంలో స్టైఫండ్ కూడా అందజేస్తారని తెలిపారు.

పరామర్శ

గోరంట్ల: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న స్టోర్ డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు, సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు కోట్లో రంగారెడ్డిని శనివారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సోదరుడు మల్లికార్జున మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ ధనుంజయ రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి (సమర) రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: ఢిల్లీలో కార్మిక, రైతు, వ్యవసాయ సమస్యలపై ఈనెల 5న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆటోస్టాండ్ వద్ద కార్మికులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు, రైతులు, కార్మికులను మోసం చేశారన్నారు. కేవలం పెట్టుబడిదారులు, సంపన్నుల కోసం పని చేస్తున్నారని ఆరోపించారు.

విరివిగా మొక్కలు నాటాలి

పరిగి: ప్రతి ఒక్కరూ తమ జీవితంలో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. స్థానిక పాఠశాల ప్రాంగణంలో శనివారం ప్రముఖ పర్యావరణవేత్త భాస్కర్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో మొక్కలు నాటారు. పర్యావరణానికి మొక్కలు ప్రాణాధారమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అశ్వర్థనారాయణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.